క్లుప్తంగా

సంక్షేమ పథకాలతో అభివృద్ధికి నాంది



చావలి(వేమూరు): ప్రభుత్వ సంక్షేమ పథకాలు సమాజ అభివృద్ధికి నాంది అని నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు తెలిపారు. వేమూరు మండలంలోని చావలి గ్రామంలో సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరలా సీఎంను చేస్తే అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టడం జరుగుతుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు కూచిపూడి రవి, మాజీ జెడ్పీటీసీ విష్ణుమొలకల వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు గాజుల భాను ప్రకాశ్, గాజుల మోహన్, తిరుపతి రాయుడు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభం



బాపట్ల: బాపట్ల మండలం నందిరాజుతోట గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ గంగా పార్వతీ సమేత ఓంకార బ్రహ్మ లింగేశ్వర స్వామి వారి దేవస్థానం నందు ఆదివారం నుంచి శుక్రవారం వరకు మహాశివరాత్రి మహోత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఆదివారం ఉదయం 12 ద్వాదశ జ్యోతుల ప్రజ్వలన, మహా మంత్ర యజ్ఞం ప్రారంభించారు. శుక్రవారం మహాశివరాత్రి రోజున శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి కల్యాణం, రాత్రి 10 గంటలకు ఏకాదశ రుద్రాభిషేకములు, లింగోద్భవకాలం వరకు జరగనున్నట్లు చెప్పారు. మహా శివరాత్రి సందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం, అన్న ప్రసాద వితరణతో పాటు స్వామి వారి గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు నందిరాజు తోట భక్త సమాజం వారు తెలిపారు.

ప్రారంభమైన శివపార్వతుల కల్యాణోత్సవాలు



భట్టిప్రోలు: మహాశివరాత్రిని పురస్కరించుకుని భట్టిప్రోలు మండలం సూరేపల్లి గ్రామంలో కొలువైన శ్రీ కేదారేశ్వర వాయులింగ ఆలయంలో శివపార్వతుల కల్యాణోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ నెల 7వ తేదీ వరకు రాత్రి 7 నుంచి 12 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. 8వ తేదీ శివరాత్రి పర్వదినాన ఉదయం నుంచి రాత్రి వరకు అభిషేకాలు జరుగుతాయని పేర్కొన్నారు. భక్తులు స్వహస్తాలతో స్వామి వారికి అభిషేకాలు చేసుకోవచ్చునని తెలిపారు. ఆ రోజు ఉదయం నుంచి రాత్రి వరకు అల్పాహారం, అన్నదాన కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు.

రోగులకు ఉచిత వైద్య పరీక్షలు



కర్లపాలెం: దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు వైద్యుల సలహాల మేరకు మందులు వాడాలని ప్రముఖ మధుమేహ వైద్యులు చల్లా రామ్మోహన్‌రావు తెలిపారు. రామకృష్ణ సేవా సమితిలో ఆదివారం పేరలి నరసయ్య మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 120 మంది మధుమేహం, రక్తపోటు వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు టివి సుబ్బారావు, వ్యవస్థాపకులు కాటూరి వెంకటేశ్వరరావు, సమితి సభ్యులు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులకు ఆర్థిక సాయం

బాపట్ల: ఆర్థికంగా వెనుకబడి చదువుకోలేని వారికి అమెరికన్ ప్రోగ్రెసివ్ సాయం అందిస్తుందని అసోసియేషన్ నాయకులు డాక్టర్ ఉదయ్ శంకర్ పేర్కొన్నారు. అన్నం సతీష్ ప్రభాకర్ రావు కాపు కల్యాణ మండపంలో ప్రకాశం, బాపట్ల జిల్లాలకు చెందిన 170 మంది బలహీన వర్గాలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులకు రూ.30 లక్షల నగదుతో పాటు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. సభానంతరం అతిథులకు జ్ఞాపికలను అందజేశారు. ఉపాధ్యాయుడు తాంత్ర సుబ్బారావు, అరవ రామకృష్ణ, డాక్టర్ జగదీష్, రాఘవరావు, గిడుగు సోమయ్య, సత్యనారాయణ, రాఘవ, భాస్కర్ రావు, శ్రీనివాసరావు, గంటా అంజిబాబు, వెంకట్రావు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజ స్థాపనకు కృషి చేద్దాం

ఎమ్మెల్యే కోన రఘుపతి



చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల: పోలియో రహిత సమాజం కోసం అంతా కలిసి కృషి చేద్దామని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పిలుపు నిచ్చారు. పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. పోలియో మహమ్మారిని తరమికొట్టేందుకు ప్రతి ఏడాది పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూడు రోజులు పాటు కొనసాగే ఈ కార్యక్రమంలో 0–5 ఏళ్ల పిల్లలందరికీ తప్పని సరిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోన రఘుపతి సతీమణి కోన రమాదేవి, జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ ఎస్.విజయమ్మ, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, కోకి రాఘవరెడ్డి, నాయకులు కొక్కిలిగడ్డ చెంచయ్య, నర్రావుల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

పోలియో చుక్కలతో చిన్నారుల ఆరోగ్యం పదిలం

చెరుకుపల్లి: పోలియో రహిత సమాజం కోసం తల్లి దండ్రులు వారి చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేయించాలని వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజక వర్గ సమన్వయ కర్త డాక్టర్ ఈవూరి గణేష్ కోరారు. పలు గ్రామాల్లోని పోలియో చుక్కల పంపిణీ కేంద్రాలను ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం చెరుకుపల్లి ఐలాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన పల్స్‌పోలియో కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో వైద్యులు జీవన్ లత, భావన, సాలేహా జుబేర్, అబ్దుల్ సమ్మద్, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పిట్టలవానిపాలెం: పోలియో రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి కోరారు. మండలంలోని చందోలు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో ఆదివారం పల్స్ పోలియో కేంద్రం వద్ద చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.0 నుంచి 5 ఏళ్ల లోపు చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్ నరసింహారావు మాట్లాడుతూ మండలంలో మొత్తం 30 పల్స్ పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 100 మందికి పైగా సిబ్బంది విధులు చేపట్టినట్లు పేర్కొన్నారు.

చిన్నారులకు పోలియో చుక్కలు తప్పనిసరి

రేపల్లె రూరల్: చిన్నారుల నిండు జీవితానికి బంగారు బాటలు వేయాలంటే పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని డాక్టర్ ఆర్ ప్రసాదరావు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదు సంవత్సరాల చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. తద్వారా పోలియో మహమ్మారిని సమాజం నుంచి పారద్రోలవచ్చన్నారు. వైద్యశాలలు, సబ్‌సెంటర్లు, సచివాలయాలతో పాటు జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాలలో సిబ్బంది పోలియో చుక్కలు వేస్తారన్నారు. తొలి రోజు ఆయా కేంద్రాల పరిధిలో అందుబాటులో లేని చిన్నారులకు సోమ, మంగళవారాలలో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కర్లపాలెం: రెండు పోలియో చుక్కలు వేయటం ద్వారా చిన్నారులకు అంగవైకల్యం లేని బంగారు భవిష్యత్తు అందించవచ్చునని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ సుహానాబేగం, డాక్టర్ గోపీనాథ్ తెలిపారు. కర్లపాలెం మండలంలో ఆదివారం జరిగిన పల్స్‌పోలియో కార్యక్రమంలో 2,884 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయటం ద్వారా 98 శాతం పంపిణీ పూర్తి చేసినట్లు వైద్యులు తెలిపారు. ఏంవీరాజుపాలెంలో ఏఎంసీ చైర్మన్ సీతారామిరెడ్డి, కర్లపాలెం పాలకేంద్రం వద్ద ఎంపీపీ వనజ, నర్రావారిపాలెంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, ఆయా గ్రామాలలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

చుండూరు(వేమూరు): పోలియో నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని ఎంపీపీ జాలాది రూబేను అన్నారు. చుండూరు మండల కేంద్రంలో పల్స్ పోలియో కేంద్రంలో ఎంపీపీ జాలాది రూబేను చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. 0 నుంచి 5 ఏళ్ల లోపు పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేయించాలని కోరారు.

భట్టిప్రోలు: చిన్నారులకు వేసే రెండు పోలియో చుక్కలు వారి నిండు జీవితానికి రక్షణ ఇస్తాయని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయ భాస్కరి, భట్టిప్రోలు సర్పంచ్ దారా రవి కిరణ్మయిలు పేర్కొన్నారు. ఆదివారం సామూహిక పల్స్ పోలియో కార్యక్రమం భట్టిప్రోలు, వెల్లటూరు పీహెచ్‌సీల పరిధిలోని నిర్వహించిన కేంద్రాలలో విజయవంతమైంది. భట్టిప్రోలు మండలం గుత్తావారిపాలెంలలో ఎంపీపీ, అద్దేపల్లిలో జెడ్పీటీసీ సభ్యుడు, భట్టిప్రోలు, ఐలవరం, పల్లెకోన, వెల్లటూరు, సూరేపల్లి గ్రామాల్లో ఆయా గ్రామ సర్పంచులు పోలియో కేంద్రాలను ప్రారంభించారు.



చావలిలో పిల్లలకు చుక్కల మందు వేస్తున్న అశోక్‌బాబు

చావలి(వేమూరు): చిన్నారుల నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు ఎంతగానో ఉపయోగపడతాయని నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు అన్నారు. వేమూరు మండలంలోని చావలి గ్రామంలో పల్స్ పోలియో కేంద్రం వద్దకు వెళ్లి ఆయన చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. 0 నుంచి 5 ఏళ్ల లోపు పిల్లలకు తప్పనిసరిగా పల్స్ పోలియో చుక్కలు వేయించాలని కోరారు.

నిజాంపట్నం: పోలియో రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కూచినపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నాగార్జున, డాక్టర్ ప్రణవి తెలిపారు. ఆదివారం నిర్వహించిన పల్స్‌పోలియో కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.కూచినపూడి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో 42 కేంద్రాల ద్వారా 2230 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు తెలిపారు.



భట్టిప్రోలులో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ లలిత కుమారి



రేపల్లెలో పోలియో చుక్కలు వేస్తున్న ఆరోగ్య సిబ్బంది



చెరుకుపల్లిలో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న డాక్టర్ ఈవూరి

మహాగర్జనను విజయవంతం చేయాలి

కర్లపాలెం: ఈనెల 9న అమరావతిలో జరిగే దివ్యాంగుల మహాగర్జనను విజయవంతం చేయాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిట్ల శ్రీనివాసరెడ్డి కోరారు. కర్లపాలెంలోని పిట్ల సేవా సమితి కార్యాలయంలో ఆదివారం మహాగర్జన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో మహాగర్జన భారీ ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. దివ్యాంగుల హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడు పఠాన్ జానీ భాష మాట్లాడుతూ దివ్యాంగుల హక్కుల చట్టాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. దివ్యాంగులకు పింఛను రూ.6 వేలకు పెంచాలని, దివ్యాంగుల పెళ్లికానుక నగదు రూ.2 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు కంది వెంకటరెడ్డి, గోగన ఆదిశేషు, కోటిరెడ్డి, విజయ్, ప్రభాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



కర్లపాలెంలో గోడ పత్రికలు ఆవిష్కరించిన దివ్యాంగులు

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

చావలి(వేమూరు): విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదానికి పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. వేమూరు మండలంలోని చావలి గ్రామంలోని కొత్తపాలెంలో శనివారం అర్ధరాత్రి సిగిరిశెట్టి యానాది ఇల్లు పూర్తిగా దగ్ధమైయింది. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు బాధితులను పరామర్శించారు. కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. రెవెన్యూ అధికారులను ఆస్తి నష్టం అంచనా వేయాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ యల్లమాటి మోహన్, జాలాది రూబేను, సొసైటీ అధ్యక్షులు గాజుల భాను ప్రకాశ్, గాజుల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కల్లు గీత కార్మికుడి మృతి

చెరుకుపల్లి: కల్లు గీత కార్మికుడు తాడిపై నుంచి ప్రమాద వశాత్తు జారిపడి మృతి చెందిన ఘటన కనగాల గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం మండల పరిధిలోని కనగాల గ్రామానికి చెందిన బెల్లంకొండ సుబ్రహ్మణ్యం (45) గత 15 సంవత్సరాలుగా కల్లుగీతనే వృత్తిగా ఎంచుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రోజు వారీ దినచర్యలో భాగంగా ఆదివారం కనగాల ఎస్టీ కాలనీ సమీపంలో కల్లు వడిచేందుకు తాడి చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు ఒక్కసారిగా తాను కట్టుకున్న మోకు జారి పోవటంతో సుబ్రహ్మణ్యం జారి కింద పడిపోయాడు. స్థానికులు అతడిని లేపేందుకు ప్రయత్నించగా సుబ్రహ్మణ్యం అప్పటికే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

నిజాంపట్నం: ఆలయాల నిర్మాణంతో గ్రామాల్లో ప్రజలు సుఖ సంతోషాలతో ఉంటారని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. మండలంలోని కొత్తపాలెం గ్రామంలో గ్రామ దేవత నాంచారమ్మతల్లి ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు.ఈ సందర్భంగా ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు మాట్లాడుతూ గ్రామాల్లో ఆలయాలు నిర్మించుకోవడం మంచి పరిణామమని తెలిపారు.ఆయా గ్రామాల్లో ఆలయాలు నిర్మిచుకోవడం వల్ల గ్రామానికి, ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.కొత్తపాలెం గ్రామంలో నాంచారమ్మతల్లి ఆలయ నిర్మాణానికి తన వంతు సాయాన్ని అందించి ఆలయాన్ని సుందరంగా నిర్మిస్తామని తెలిపారు. ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కొక్కిలిగడ్డ రవి, ఎంపీటీసీ సభ్యులు గోపాలకృష్ణ, లంకె శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ రామాని కోటేశ్వరరావు, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న ఎంపీ మోపిదేవి

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

భట్టిప్రోలు:భట్టిప్రోలు హైస్కూల్ పూర్వ విద్యార్థులు 50 ఏళ్ల తరువాత ఆత్మీయంగా కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ ఆ నాటి మధుర స్మృతులను నెమరవేసుకున్నారు. భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్‌లో 1973–74 నాటి బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయంగా కలుసుకున్నారు. ఆ నాడు చదువుకున్న 85 మంది విద్యార్థుల్లో 45మంది మరలా 50 ఏళ్ల తరువాత కలుసుకున్నారు. ఆ నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ మురిసిపోయారు. తమకు చదువు చెప్పిన గురువులైన కొణతం నాంచారయ్య, లాల్‌జాన్ భాషాలను ఘనంగా సత్కరించారు. అర్ధ శతాబ్దం తరువాత ఆనాటి మిత్రులను కలుసుకోవడంతో ఓ మధురానుభూతి కలిగిందని ఆనందం వ్యక్తం చేశారు. పూర్వ విద్యార్థులు బొలిశెట్టి శ్రీనివాసరావు, లక్కరాజు రాధా కృష్ణమూర్తి,, రామనాథం రామకృష్ణ, ఆకురాతి ద్వారకానాథ్, మానేపల్లి రామమోహన్‌రావులు పర్యవేక్షించారు.



1973-74 బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థులు

సముద్రంలో అలల తాకిడికి యువకుడు గల్లంతు

స్పందించి కాపాడిన పోలీసులు

బాపట్లటౌన్: స్నేహితులతో కలిసి సముద్ర స్నానాలు చేస్తుండగా ఒక్కసారిగా వచ్చిన అలల తాకిడికి గుంటూరు పట్టణానికి చెందిన టి.రాజు సముద్రంలో మునిగి కొట్టుకుపోయారు. ఈ విషయం గమనించిన తోటి స్నేహితులు కేకలు వేయడంతో తీరంలో విధులు నిర్వర్తిస్తున్న హెడ్ కానిస్టేబుల్ ఎం.పోతురాజు, హోంగార్డ్ నరసింహమూర్తి, గజ ఈతగాళ్లు గోపి, ఆంజనేయులు, సత్యనారాయణ, నాగేశ్వరరావు వెంటనే స్పందించి యువకుడిని సురక్షితంగా కాపాడారు. యువకుడి ప్రాణాలు కాపాడిన సిబ్బందిని, గజ ఈతగాళ్లను ఎస్పీ వకుల్‌జిందాల్ అభినందించారు.



గల్లంతైన యువకుడిని కాపాడిన పోలీసులు

వైఎస్సార్ సీపీలోకి చేరికలు



వైఎస్సార్ సీపీలోకి చేరిన టీడీపీ కార్యకర్తలతో వరికూటి అశోక్‌బాబు

జంపని(వేమూరు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలకు ప్రజలు ఆకర్షితులై వైఎస్సార్ సీపీలోకి చేరుతున్నారని నియోజక వర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు అన్నారు. జంపని బస్టాండ్ సెంటరులో దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలదండలు వేసి నివాళులు అర్పించారు. వేమూరు మండలం జంపని గ్రామంలోని ముస్లిం, ఎస్సీ, జనసేన పార్టీకు చెందిన 30 కుటుంబాల కార్యకర్తలు ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. వీరందరికీ అశోక్‌బాబు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చుండూరు పెద్ద మరియమ్మ, ఎంపీపీ యల్లమాటి మోహన్, గ్రామ పార్టీ కన్వీనర్ షేక్ బుజ్జి, షేక్ దాద్ బుడే, మండల పార్టీ అధ్యక్షుడు బొల్లిముంత ఏడుకొండలు, ఉప యంపీపీ షేక్ బాజీ, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కూచిపూడి(వేమూరు): అమర్తలూరు మండలంలోని తురిమెళ్ల గ్రామ పంచాయతీ 2వ వార్డు మెంబరుతో పాటు మరి కొంత మంది తెలుగుదేశం కార్యకర్తలు ఆదివారం కూచిపూడి గ్రామంలోని పార్టీ కార్యాలయంలో ఇన్‌చార్జి వరికూటి అశోక్ బాబు సమక్షంలో పార్టీలో చేరారు.అశోక్‌బాబు మాట్లాడుతూ తెలుగుదేశం నుంచి వైఎస్సార్ సీపీలోకి వచ్చిన కార్యకర్తలకు పార్టీలో సముచిత స్థానం కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు యలవర్తి సురేష్, కొల్లమూడి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ సత్తా చాటాలి

రేపల్లె నియోజక వర్గ సమన్వయ కర్త డాక్టర్ ఈవూరి గణేష్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డాక్టర్ ఈవూరి

చెరుకుపల్లి: చిన్నతనం నుంచే విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని అలవర్చుకుని క్రీడల్లో రాణించాలని వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజక వర్గ సమన్వయ కర్త డాక్టర్ ఈవూరి గణేష్ సూచించారు. మండలంలోని గుళ్లపల్లి జెడ్పీ హైస్కూల్లో ఆదివారం అండర్ 16 కబడ్డీ, 33వ సబ్ జూనియర్స్ రాష్ట్ర స్థాయి కబడ్డీ టీంల ఎంపిక కార్యక్రమానికి గణేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే బాల బాలబాలికలు విద్యతో పాటు క్రీడల పట్ల ఆసక్తి చూపి ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో మరుగున పడిన క్రీడాకారులను గుర్తించి వారిలో క్రీడా స్ఫూర్తిని నింపేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా గ్రామ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను నిర్వహించారన్నారు. రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఎంపిక చేసిన 12 మంది బాలుర కబడ్డీ క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరచి విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం డాక్టర్ గణేష్ సెలక్షన్స్‌కు వచ్చిన క్రీడాకారులను పరిచయం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి పి పద్మజ బాల, సహ కార్యదర్శి పి నాగాంజనేయులు రెడ్డి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కందుల వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు అక్కల శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శి దుండి నల్లిరెడ్డి, గుళ్లపల్లి పాఠశాల హెచ్‌ఎం కవిత తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం



బాధితులకు ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

కర్లపాలెం: అగ్ని ప్రమాద బాధితులకు ఎమ్మెల్యే కోన రఘుపతి అండగా నిలిచారని ఎంపీపీ యారం వనజ, ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి తెలిపారు. ఇటీవల కొత్త నందాయపాలెం, గొడపాలెంలో పూరిళ్లు దగ్ధమైన బాధిత కుటుంబాలకు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఆర్థికసాయం అందజేశారు. కొత్త నందాయపాలెంలో అగ్నిప్రమాద బాధితులకు ఎమ్మెల్యే కోన రఘుపతి పంపిన రూ.10వేలు, గొడపాలెంలో గ్రామ సర్పంచ్ నక్కా లలితకుమారి అందజేసిన రూ.5వేలతో పాటు ఎమ్మెల్యే కోన రఘుపతి పంపిన రూ.10 వేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పరమానందకుమార్, ఆట్ల నాగేశ్వరరెడ్డి, పేరాల వెంకటసురేష్, ఆట్ల అయ్యప్పరెడ్డి తదితరులు ఉన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో..

పాత నందాయపాలెం, గొడపాలెంలోని అగ్నిప్రమాద బాధితులకు రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు బీఎస్ నారాయణభట్టు, కర్లపాలెం అధ్యక్షుడు ఇనకొల్లు పోలీస్‌రావు తాత్కాలిక గుడారం, నిత్యావసర సరుకులు, వంటపాత్రలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు ఏకశిరి నరసింహారావు, వెంకటనాథ్, రవికుమార్, వెంకటరెడ్డి, తదితరులు ఉన్నారు.

ముస్లింల సంక్షేమానికి పెద్దపీట

ఎమ్మెల్యే కోన రఘుపతి



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల: ముస్లింల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ కట్టుబడి ఉంటుందని ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. అంజుమన్ సంస్థకు షాదీఖానాను అప్పగించే కార్యక్రమం ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ ముస్లిం సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. బాపట్ల పట్టణంలో అంజుమన్ సంస్థ అభివృద్ధికి మసీదులో షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేసేందుకు సాయం అందిస్తామని చెప్పారు. షాదీఖానా నిర్వహణ బాధ్యతతో పాటు అభివృద్ధికి అంజుమన్ సంస్థ కృషి చేస్తుందనే నమ్మకంతో ఆ సంస్థకు అప్పగించటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, కోకి రాఘవరెడ్డి, అంజుమన్ సంస్థ అధ్యక్షులు రహీమ్‌జానీ, కార్యదర్శి కరీమ్, మాజీ అధ్యక్షులు షేక్.జిలాని, మత పెద్దలు ఆసిఫ్,ఆరీఫ్, నూర్‌బాషా, సంఘం అధ్యక్షులు సిద్ధయ్య తదితరులు ఉన్నారు.

విలువ జోడింపుతోనే రైతుకు ఆదాయం

హార్టీకల్చర్ డెప్యూటీ డైరెక్టర్ వి.ఎస్. ధర్మజ

గుంటూరు రూరల్: పంటలకు విలువల జోడింపుతో రైతులు మంచి ధరలు పొందవచ్చని హార్టీకల్చర్ డెప్యూటీ డైరెక్టర్ వి.ఎస్. ధర్మజ తెలిపారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట గ్రామంలోని రైతు నేస్తం ఫౌండేషన్‌లో గత రెండు రోజులుగా జరుగుతున్న రైతులకు శిక్షణ ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతులు వ్యవసాయాన్ని ఆనందంగా కొనసాగించలేక పోతున్నారన్నారు. సాగు లాభదాయకంగా కొనసాగాలంటే దిగుబడులకు విలువ జోడిస్తే సరైన మార్గమని తెలిపారు. సేంద్రియ పద్ధతిలో వరి, అపరాల పంటల సాగు, సేంద్రియ సాగులో ఉపయోగించే వివిధ రకాల కషాయాలు, ద్రావణాల వివరాలు, వాటి ఉపయోగాలు రైతు శివనాగమల్లేశ్వరరావు వివరించారు. జామ సాగురైతులు నెమటోడ్స్ సమస్యను ఎక్కువగా ఎదుర్కొంటున్నారని, దీనికి సేంద్రియ సాగే సరైన దారని రైతు శబరినాథ్ తన అనుభవాలను రైతులతో పంచుకున్నారు. బహుళ అంచెల సాగు గురించి ప్రకృతి రైతు ఏడుకొండలు తెలిపారు. వివిధ వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడింపు, వివిధ యంత్ర పరికరాల వివరాలు, ధర, పనిచేసే విధానాలను రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు పవర్ పాయింట్ ద్వారా వివరించారు. అనంతరం శిక్షణకు హాజరైన రైతులకు సర్టిఫికెట్లు అందజేశారు.